సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని 16 మండలాలలో పాడేరు డివిజన్ పరిధిలోని అనంతగిరి, అరుకువ్యాలీ, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జి.కె. వీధి, కొయ్యూరు, రంపచోడవరం డివిజన్ పరిధిలో రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, రాజవొమ్మంగి, వై.రామవరం, మారేడిమిల్లి, అడ్డతీగల మండలాల్లో ఉన్న 84 నీటి వినియోగదారుల సంఘాలకు అసాధారణ సర్వసభ్య మండలి సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు జిల్లాలో .నిర్దేంచిన గ్రామాలలో నిర్వహిస్తున్న సమావేశ వేదిక వద్దకు ఉదయం 8.00 గంటలకు చేరుకోవాలని తెలియజేసారు. ముందుగా ప్రాదేశిక నియోజక వర్గం సభ్యులను ఎన్నుకుంటారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుండి 5గంటల వరకు నీటి సంఘాల అధ్యక్షులను ఉపాధ్యక్షులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. నీటి సంఘం ఓటు హక్కు కలిగిన భూ యజమానులు సభ్య సమావేశంలో పాల్గొనాలని కోరారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: విద్యుత్ చార్జీలను తగ్గించాలని మండల కేంద్రంలోని నాలుగు రోడ్డు జంక్షన్ వద్ద సిపిఎం నేతలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు. ఈ సంధర్భంగా మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ, పేదలపై విపరీతమైన విద్యుత్ పిక్సిడ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, డ్యూటీ చార్జీలు, సర్దుబాటు చార్జీలు వంటి పేర్లతో సామాన్య గృహ వినియోగదారులపై మోయలేని విద్యుత్ బారాలు మోపుతుందన్నారు. బడా పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని చెప్పారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత విపరీతంగా విద్యుత్ చార్జీలు పెంచారాన్నారు.విద్యుత్ ప్రవేటికరణలో భాగంగా స్మార్ట్ మీటర్ల పేర్లతో పేదల సొమ్ము దోచుకుంటుంటున్నారన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జి బుజ్జిబాబు, పి.బాలదేవ్, టి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

వినతులు స్వీకరిస్తున్న పిఒ

రైతు సమస్యలపై వైసిపి నిరసన

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని ఎమ్మెల్సీ కే రవిబాబు, అరకు పాడేరు ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వర రాజు విమర్శించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శుక్రవారం పాడేరు శాసన సభ్యులు అల్లూరి జిల్లా అధ్యక్షులు .మత్స్య రాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో వైసీపీ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. డిఆర్ఓకు వినతి పత్రం అందజేశారు,. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ పార్లమెంటు సభ్యురాలు గొడ్డేటి మాధవి, మాజీ శాసన సభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు రైతులు తదితరులు పాల్గొన్నారు,



వినతిపత్రం ఇస్తున్న జెడ్పి ఛైర్పర్సన్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపి

'మీ కోసం'లో 57 వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 57 ఫిర్యాదులు అందాయి. ఐటిడిఎ పి ఓ వి.అభిషేక్, డి.ఆర్.ఓ కె.పద్మలత, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి వి.ఎస్.ప్రభాకరరావు వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

పాడేరు మండలం గుత్తులపుట్టు పంచాయతీ జి. కొత్తూరు గ్రామానికి చెందిన ఆర్.వసంత ఇల్లు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. జి.మాడుగుల మండల వంజరి పంచాయతీ బలియపేట గ్రామానికి చెందిన పొంగి గౌరి రేషన్ కార్డు, ఒంటరి మహిళా పింఛను మంజూరు చేయాలని కోరారు. ముంచంగిపుట్టు మండలం బంగారు మెట్ట పంచాయతీ రావిడిపుట్టు గ్రామస్తులు బి.టి. రోడ్డు, బ్రిడ్జి నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతగిరి మండలం లుంగపర్తి పంచాయతీ వనుకొండ గ్రామంలో ఎంపిపి పాఠశాలకు భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం.హేమలత, గురుకులం ప్రిన్సిపాల్ మూర్తి, ఎల్డిఎం మాతునాయుడు, సిపి ఓ ఎస్ ఎస్ ఆర్ పట్నాయక్, డిఎస్డిఓ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

గృహాలను త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి -జి.మాడుగుల: పీఎం జన్మన్ పథకం కింద మంజూరైన గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ పిడి బాబు నాయక్ సూచించారు. శుక్ర వారం మండలంలో జంగాలమెట్ట గ్రామంలో పలు గృహాలను తనిఖీ చేస్తూ లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేస్తే రెండవ దపా బిల్లు పెట్టే అవకాశం ఉంటుందన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న పిడి

శ్రమదానంతో రోడ్డు పనులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయితీ డీ.సంపంగి పుట్టు పీవీటీజీ గిరిజనులు సొంతంగా మట్టి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఇటీవల కాలంలో తుఫానుతో రహదారి గుంతలు ఏర్పడడంతో గ్రామస్తులంతా కలిసి శుక్రవారం నిర్మాణం చేపట్టారు. రోడ్డు సౌకర్యం సరిగా లేక పోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా తారు రోడ్డు సౌకర్యం కల్పించ లేదని వారు వాపోయారు. సరైన రోడ్డు సౌకర్యం లేక ఇల్లు నిర్మించడానికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గర్భిణుల డెలివరీ సమయాల్లో అంబులెన్స్ రాకపోవడంతో డోలీలో హాస్పిటల్‌కు తరలిస్తున్నామన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్న గిరిజనులు

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ - పలు గ్రామాల్లో ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ్ తెలిపారు. తహసీల్దార్ వి.త్రినాధరావు అధ్యక్షతన పాత పాడేరు గ్రామ సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ పరమైన సమస్యలకు దరఖాస్తులు అందజేస్తే పరిష్కరిస్తామన్నారు. భూ సమస్యలు మ్యుటేషన్లు, ధృవ పత్రాలు జారీ చేయడానికి ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదన్నారు. భూ సరిహద్దు సమస్యలు, ఆక్రమణలు, కుల ధృవీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికేట్లు జారీ చేస్తామన్నారు. రెవెన్యూ సదస్సులులో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

పాడేరు ఐటిడిఏ పి.ఓ వి.అభిషేక్ మాట్లాడుతూ, భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం మీ వద్దకే వచ్చి పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తోందన్నారు.80 శాతం భూ సమస్యలే గ్రీవెన్సుకు వస్తున్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి డి.ఆర్.డి.ఏ .పి.డి.వి.మురళి, సర్వే సహాయ సంచాలకులు దేవేంద్రుడు, డి.ఐ. వెంకటరావు, వైస్ ఎంపిపి గంగపూజారి శివకుమార్, పాడేరు సర్పంచ్ కె. ఉషారాణి, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు, కేంద్ర కాఫీ బోర్డు మెంబరు కురసా ఉమా మహేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి

మాట్లాడుతున్న ఎంపిడిఒ

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-చింతపల్లి: బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం బాల్య వివాహాలతో కలుగు అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు సంభవిస్తున్నాయని తెలిపారు.చిన్న వయసులో వివాహాలు చేయడంతో ఆరోగ్యపరంగాను నష్టాలు జరిగే ప్రమాదం లేకపోలేదన్నారు.ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యూఓ బలిరెడ్డి నాగజయలక్ష్మి, ఐసిడిఎస్ పిఓ రమణి, వైద్యాధికారి స్వామి పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి జి.మాడుగుల: అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు జి.మాడుగుల పోలీసులు శుక్రవారం బోయితిలి పంచాయతీ కేంద్రంలో మెగా మెడికల్ క్యాంప్, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాడేరు డిఎస్పి ప్రమోద్ విచ్చేసి స్థానిక గిరిజనులతో ఫ్రెండ్లీ పోలీస్ సింగ్ చేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మెడికల్ శిభిరంలో 300 మందికి, తనిఖీలు నిర్వహించి తగు మందులను అందజేశారు. 35 వాలీబాల్ టీములు పాల్గొనగా, గెలుపొందిన మూడు టీములకు బహుమతులను అందజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ సన్యాసినాయుడు ఎస్సై అప్పలరాజు, పోలీస్ సిబ్బంది మహిళా పోలీసులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ట్రోఫీని ఇస్తున్న పోలీసులు

మన్యంలో వైద్యాన్ని మెరుగుపరచాలి

- సిపిఎం మండల మహాసభలో జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్
- రాజవొమ్మంగిలో స్పెషలిస్టు వైద్యసేవలు అందించాలి
- అల్లూరి, కొమరంభీం స్ఫూర్తితో గిరి సమస్యలపై పోరాటం
- 16,17 తేదీల్లో జిల్లా మహాసభల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పిహెచ్‌సిని 30 పడకల స్థాయికి సిహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేసి, గైనకాలజీ, పీడియాట్రీషియన్, ఇతర స్పెషలిస్ట్ వైద్యుల నియామకంతో గిరిజనులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. .శుక్రవారం మండలంలోని దుర్గానగరం గ్రామంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రామరాజు, పొత్తూరి సత్యనారాయణ, కె రమణ అధ్యక్షతన సిపిఎం ఆరవ మండల మహాసభ నిర్వహించారు. మహాసభలో బొప్పెన కిరణ్‌తోపాటు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎ అంటే అమరావతి, పి అంటే పోలవరం అంటూ ఎపికి కొత్తభాష్యం చెప్పిన సిఎం చంద్రబాబు, పోలవరం, నిర్వాసితుల పరిహారం, సమస్యల పరిష్కారం ఊసెత్తడం లేదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు అరకుసభలో జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరణ, ప్రత్యేక డిఎస్‌సి ప్రకటనకు మాటిచ్చిన సిఎం చంద్రబాబు ఇపుడు మరిచారన్నారు. రాష్ట్రంలో నూతన కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలల కాలంలో రూ.634 వేల కోట్ల అక్రమ దందా వ్యాపారం జరిగిందని రూ9.8 కోట్లమేర విద్యుత్ బిల్లులు పెంచి ప్రజలపై మోయలేని భారం వేసిందన్నారు. రూ.27 వేల కోట్ల రూపాయల కరెంటు చార్జీలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడేవారు లేరన్నారు..బిజెపి దుర్మార్గాలను ప్రశ్నించి, రాష్ట్రానికి రావాల్సిన నిధులను రప్పించడంలో కూటమి మంత్రులు విఫలమయ్యారని, ప్రధాని మోడీని ప్రశ్నిస్తే జైల్లోకి పంపుతారనే భయం వెంటాడుతోందన్నారు. గిరిజన సబ్ ప్లాన్ నిధులు, వారి హక్కులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, దీనిపై అల్లూరి, కొమరంభీం స్ఫూర్తితో సమిష్టిగా ఎర్ర జెండా నీడన పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈనెల 16,17తేదీల్లో రంపచోడవరంలో సిపిఎం జిల్లా మహాసభల జయప్రదానికి పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా పార్టీని బలోపేతం చేసి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకుందామన్నారు.

. తొలుత మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరవీరుల చిత్రపటాలకు పూల మాలలను వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఎం జెండాను ఎగుర వేసి, ప్రజానాట్యమండలి కళాకారులు అభ్యుదయ గేయాలను ఆలపించారు. అనంతరం జరిగిన సభలో భవిష్యత్తు ఉద్యమ కర్తవ్యాలపై చర్చించి తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు కొండ్ల సూరిబాబు, సింగిరెడ్డి అచ్చారావ్, రామరాజు, పాండవుల సత్యనారాయణ, ఎం రమేష్.తెడ్ల అబ్బాయి, టి శ్రీను, కె.జగన్నాథం, కె.అప్పలరాజు. సుబ్బారావు,శ్రీను. పెయ్యల పాపారావు పాల్గొన్నారు.

సిపిఎం మండల మహాసభలో మాట్లాడుతున్నపార్టీ జిల్లా కార్యదర్శి కిరణ్

సిపిఎం మండల కార్యదర్శిగా సూరిబాబు

సిపిఎం రాజవొమ్మంగి మండల మహాసభలో 11మందితో పార్టీ నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. మండల కార్యదర్శిగా కొండ్ల సూరిబాబు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, పెయ్యల పాపారావు, కుంజం జగన్నాథం, టి శ్రీను, మేలిన రమేష్, ఎ. మంగ, కె ప్రవీణ్, పి.సత్యనారాయణ, సింగిరెడ్డి అచ్చారావు, పి రామరాజులను సభ్యులుగా ఎన్నుకున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం

ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి

- కొనుగోలు కేంద్రాల్లో రైతన్నల పడిగాపులు
- బస్తాలు లేవనే సాకుతో సేకరించని అధికారులు
- 15రోజులుగా ఆరుబయటే ధాన్యం రాశులతో అవస్థలు
- తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలి : ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్ పురం : మండలం పరిధిలోని జల్లి వారి గూడెం గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో స్థానిక రైతులు తెచ్చిన ధాన్యాన్ని 15 రోజులుగా బస్తాలు లేవనే పేరుతో కొనుగోలు చేయకుండా వదిలివేయడం దారుణమని ఎంపీపీ కారం.లక్ష్మి మండిపడ్డారు శుక్రవారం ములకనపల్లి గ్రామ పంచాయతీలో సందర్శనకు వెళ్లిన ఆమె, జల్లివారి గూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి దృష్టికి అక్కడ ఉన్న రైతులు సమస్యలను విన్నవించారు. కొనుగోలు కేంద్రానికి అమ్మకానికి ధాన్యం తెచ్చి 15 రోజులు గడుస్తున్నా, బస్తాలు లేవన్న కారణంలో తూకం వేయడం లేదన్నారు .దీంతో ఆరుబయట బరకాల్లోనే ధాన్యాన్ని కుప్పలుగా పోసి, వాటిని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు బాగోలేనందున వర్షం వస్తే దాన్యం మొత్తం తడిసిపోయే ప్రమాదం ఉందని వాపోయారు.

దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి బస్తాలు తెప్పించి రైతుల ధాన్యాన్ని సేకరించాలన్నారు. ధాన్యాన్ని తరలించే వరకు పశువులు మేకలు తినకుండా అధికారులు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఎం పార్టీ కార్యదర్శి పులి సంతోష్ కుమార్, ఎంపీటీసీ పూనమ్ ప్రదీప్ కుమార్, నాయకులు సోయం.చినబాబు, పోడియం. శ్రీరామ్ మూర్తి, గుండెపూడి.లక్ష్మణరావు, జల్లి.సత్యనారాయణ, జల్లి.రాజు,తమ్మయ్య, కిట్టయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయట ఎక్కడికక్కడే పోగులుగా టార్పాలిన్లపై ఉన్న ధాన్యం రాశులు

గిరిజన యువత స్వయంఉపాధికి అండ

ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

-ప్రజాశక్తి -రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన యువతి యువకులకు ట్రైకర్ ద్వారా ఉపాధి కల్పనకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఎపి రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక ఐటిఐఎ సమావేశపు మందిరంలో వివిధ శాఖల సెక్టార్ అధికారులతో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, రంపచోడవరం ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, ట్రైకార్ డైరెక్టర్లు పి.లావణ్య, టి.అనురాధ, కె.కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా రంపచోడవరం ఐటిడిఎ పరిధిలోని ఏడు మండలాల్లో వివిధ శాఖల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న కార్యక్రమాలు తదితర అంశాలపై ఐటిడిఏ ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ గిరిజన యువత స్వయంఉపాధికి రాయితీపై వాహనాలు మంజూరుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. మెగా డీఎస్సీకి ఎక్కువమందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు, నిరుద్యోగ గిరిజన యువతకు స్వయంఉపాధి శిక్షణ, ఉద్యోగ కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. ఏజెన్సీలోని తేనె పరిశ్రమల అభివృద్ధికి యువతకు ప్రోత్సాహం అందించాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో నేటికీ కొనసాగుతున్న డోలికష్టాల నుంచి విముక్తికి ప్రతి గ్రామానికి రహదారులు, లింక్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన రైతులు ఆర్థికకాభివృద్ధికి పంపుసెట్లు, సురేగ పథకం ద్వారా సోలార్ విద్యుత్తు సెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కొక్క పథకం ద్వారా ఎంత నిధులు వచ్చింది ఎంత ఖర్చు పెట్టింది ఇంకా ఎంత నిధులు ఉన్నది ఆయన ఆరా తీశారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన రైతులకు పవర్ టిల్లర్లు , స్ప్రేయర్లు మంజూరు చేయాలన్నారు. డిఎస్సి, సివిల్స్ ఇతర ఉద్యోగ పరీక్షలకు శిక్షణనివ్వాలని కోరారు. రంపచోడవరం ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహా చాలా మాట్లాడుతూ ఏజెన్సీలోని నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు ఐటిడిఎ ద్వారా ఉచిత శిక్షణనిస్తున్నామన్ని, యాక్షన్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఏజెన్సీలోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారుఅనంతరం ట్రైకార్ డైరెక్టర్లు పి. లావణ్య, టి. అనురాధ, కె. కృష్ణారావు మాట్లాడుతూ మారేడుమిల్లి మండలంలోని రబ్బర్ ప్లాంటేషన్‌లో గిరిజన రైతులకు స్మోక్ రూమ్, రబ్బర్ ప్రాసెస్ రోలర్లు ఏర్పాటు చేయాలని . ఎల్లాపురం పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, వంతల రాజేశ్వరి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, రవికుమార్, జిసిసి డివిజనల్ మేనేజర్ జి. పార్వతీశ్వరరావు, ఎడిఎంహెచ్ఒ జి. శిరీష,పిహెచ్ఓ చిట్టిబాబు, ఉపాధి ఎపిడి శ్రీనివాసరావు, పిఎఒ ఎల్. రాంబాబు, ఎడిఎ సిహెచ్‌కెవి చౌదరి, డిఇలు చైతన్య, మల్లికార్జునరావు, పి. వెంకటరమణ, సిడిపిఓ సంధ్యారాణి, ఎంపిడిఒ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు...

మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

నేడు ఉద్యోగ శిక్షణకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి రాజవొమ్మంగి : స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో శనివారం రిటైల్ శిక్షణ కొరకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని సీడ్స్ ఏపీ ట్రైనర్ కె.రత్నకుమార్ తెలిపారు. నాలుగు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగం కల్పిస్తామని, .శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచితంగా వసతి, భోజనాలు ఏర్పాటు చేస్తామన్నారు. శిక్షణ పొందేందుకు 10 వతరగతి నుంచి డిగ్రీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్ లతో శనివారం ఉదయం ఇంటర్వ్యూకు హాజరుకావాన్నారు. తప్పనిసరిగా విద్యార్హతల సర్టిపికెట్లతోపాటు ఆదార్, కుల, ఆదాయ ధ్రువీకరణల ఒరిజినల్స్, జిరాక్సులు తీసుకురావాలన్నారు.

పలుచోట్ల రెవెన్యూ సదస్సులు

గసభలో రెవెన్యూ సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గసభ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత కోరారు. గసభ, లోగిలి రెవెన్యూ గ్రామంలో ఆర్ఐ బిపిఎమ్ రాజు అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భూ సమస్యలపై ప్రజలు అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కారం చేయాలని కోరారు. గతంలో ధరఖాస్తు చేసుకున్న పోడు పట్టాలకు నేటికీ మంజూరు చేయాలేదని చెప్పారు. తరతరాలుగా పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వకుండా ఫారెస్టు అధికారులు తిరస్కరించారని విమర్శించారు. ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క లబ్ధిదారులకు ఇప్పటికైనా పట్టాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గసభ మాజీ సర్పంచ్ పాంగి సురేష్, వైసీపీ నాయకులు బలరామ్, ఉప సర్పంచ్ మహదేవ్, టిడిపి నాయకులు సునీల్, వార్డుమెంబర్స్ సత్యనారాయణ, వీఆర్వో రవి, సర్వేయర్లు సద్దు, లోవరాజు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: రెవెన్యూ సదస్సులను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ పేర్కొన్నారు. పాలమామిడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులు జనవరి 10వ తేదీ వరకు నిర్వహిస్తారని చెప్పారు. భూ వివాదాలు, ముటేషన్లు, సరిహద్దు సమస్యలు, ఆక్రమణలు రెవిన్యూ సదస్సులో పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ, భూ సమస్యలపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని చెప్పారు. సమస్యలను 45 రోజుల్లో పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విద్యాసాగర్, తహసిల్దార్ పి.లచ్చుపాత్రుడు, డిప్యూటీ తహసిల్దార్ వి.చంద్రశేఖరరావు. స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిసిసి మాజీ చైర్మన్, టిడిపి నేత ఎంవివి ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ, భూసమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులను వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో కొయ్యూరు తాహశీల్దార్ ఎస్ ఎల్ వి ప్రసాద్ రెవెన్యూ సిబ్బంది సచివాలయం సిబ్బంది స్థానిక సర్పంచ్ పిటా సింహాచలం ఎస్ కె ఖాన్ మాజీ ఎంపీపీ గొలుసింగి సత్యనారాయణ వై వరహాల బాబు మేడిపోయిన చిన్న పాల్గొన్నారు.

అటవీ భూములకు సాగుహక్కు పట్టాలివ్వాలి

విఆర్.పురం: మండలంలోని ములకనపల్లి పంచాయతీలో గల వీర పాపన్నకుంట, గొల్లగూడెం, ముల్కనపల్లి, గ్రామాల్లో రైతులు తాతల కాలం నుండి సాగులో ఉన్న భూములకు సాగుహక్కు పట్టాలు ఇవ్వాలని శుక్రవారం ములకనపల్లి పంచాయతీలో రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ సరస్వతికి రైతు సంఘ కార్యదర్శి వడ్లది రమేష్ మాజీ రైతు సంఘ కార్యదర్శి నాగిరెడ్డి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ఎన్నిసార్లు అధికారులు విన్నవించినా స్పందించట్లేదని 56 మంది రైతులు సాగులో ఉండగా 15 మందికి అడవి భూమి అక్కు పత్రాలిచ్చి, మిగిలిన 41 మందికి ఇవ్వాల్సి ఉందని, వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. తహశీల్దార్ సరస్వతి మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారుకార్యక్రమంలో కారం సునీత, రాంబాబు, తిరుమల, సుక్కమ్మ, రాజయ్య, గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు..

సీలేరు: జీకే వీధి మండలం దేవరపల్లి పంచాయతీ మంగలపాలెంలో రెవెన్యూ సదస్సులో తమ భూములు వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేక నష్టపోయామని పలువురు రైతులు తహశీల్దార్ రామకృష్ణ వినతిపత్రాలు అందజేశారుకార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బాల సుందరం బాబు రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ డి. సత్యనారాయణ ఆర్ఐ మహదేవ్ దేవరపల్లి సర్పంచ్ సిరి బాల బుజ్జి బాబు టిడిపి పార్టీ నాయకులు ఎం. రామకష్ణ వీఆర్వోలు భారతి మేఘశ్యామ్ వీఆర్‌ఏ పశువులంటే సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నాయకుడు సన్నిబాబు

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- పెదబయలు: పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయితీలో 2023-2024, 2024-2025 సంవత్సరంలో మంజూరైన నిధులు మొత్తం రూ.22 లక్షల 6261 దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని ఎంపీడీవో ఎల్ పూర్ణయ్యకి సిపిఎం నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్ని బాబు మాట్లాడుతూ, లక్ష్మీపేట పంచాయతీ 14 గ్రామాల్లో సిపిఎం బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలించగా ఏ గ్రామంలో కూడా గత సంవత్సరం నుండి నేటి వరకు వీధిలైట్లు వేసిన దాఖలు లేవన్నారు.అయినప్పటికీ పంచాయతీ నిధులతో వీధిలైట్లు వేసినట్టు నిధులు జమ అయ్యాయన్నారు.బ్లీచింగ్, పారిశుద్ధ కార్మికులకు మెటీరియల్ కొనుగోలు చేయకుండా నిధులు పక్కదారి మళ్ళించారన్నారు. మంచినీరు సౌకర్యం కల్పించకుండానే నిధులు డ్రా చేశారన్నారు. వీటిపై ప్రజాక్షేత్రంలో బహిరంగ విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మానపడాల్, సిపిఎం మండల కమిటీ సభ్యులు బొండా గంగాధరం, జంపరంగి సునీల్ కుమార్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: స్థానిక స్కిల్ కాలేజ్‌లో శుక్రవారం ఘనంగా ఫేర్వెల్ డే ఫంక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆదివాసి పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు చట్టు మోహన్, స్కిల్ కళాశాల ప్రిన్సిపాల్ గడ్డిరాజు కిరణ్ వర్మ చేతుల మీదుగా విద్యార్థులకు ఉద్యోగ పత్రాలను అందజేశారు. అనంతరం విద్యార్థులు వివిధ డ్యాన్స్ నత్యాలతో ఉత్సాహంగా అల్లారించారు. అనంతరం ప్రిన్సిపాల్ కిరణ్ వర్మ మాట్లాడుతూ,విద్యార్థులకు హెూటల్ మేనేజ్మెంట్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ ప్లేస్మెంట్ కూడా చూపించడం జరుగుతుందన్నారు.సుమారు 60 మంది విద్యార్థులకు ఫైవ్ స్టార్ హెూటల్స్‌లో ప్లేస్మెంట్ కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి -అనంతగిరి: విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్.రజిని హెచ్చరించారు. శుక్రవారం బాలికల పాఠశాల 2లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో విద్యా బోధన, మధ్యాహ్న భోజనం అమలవుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల బాగోగులను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించామన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రుల నుండి ఫిర్యాదులు వస్తే సహించ మని హెచ్చరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-హుకుంపేట: ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ మండల కార్యవర్గం ఎన్నిక స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. మండల కార్యదర్శిగా యువరాజు ప్రధాన కార్యదర్శిగా నైని రామన్న, ఉపాధ్యక్షుడిగా ఓ.వాసుదేవులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలపై పోరాటానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం తక్షణమే సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధించాలని వారు కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.లోహితాష్, జిల్లా అధ్యక్షులు మాసడ ఈశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి ఎస్ వెంకట్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రమేష్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ ఎన్నిక జరిగింది.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- అనంతగిరి: పలు రకాల చట్టాలపై అనంతగిరి జూనియర్ కళాశాలలో శుక్రవారం డి.ఎస్.పి వేణుగోపాల్, అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.హిమగిరి, అనంతగిరి ఎస్సై డి.శ్రీనివాసరావులు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. మత్తు పదార్థాల రవాణా వంటివి చేపడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు.

గురుకుల టీచర్ల సమస్యలను పరిష్కరించాలి
- ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి పాడేరు : రాష్ట్రవ్యాప్తంగా గురుకుల సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పాడేరు ఐటిడిఏ ఎదుట సమ్మెలో కూర్చున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు మద్దతుగా శుక్రవారం కొయ్యూరు గురుకుల పాఠశాల విద్యా కమిటీ, చైర్మన్ మొట్టడం వలసయ్య దొర ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యుడు గడుతూరి సత్యనారాయణ, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ మాట్లాడుతూ, ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటం న్యాయబద్ధమెందని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు సమ్మెలో ఉంటే విద్యార్థులకు చదువు ఎలా అందుతుందని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతుంటే ప్రభుత్వానికి, విద్యాశాఖ రాష్ట్రమంత్రి లోకేష్ ఎందుకు కనబడడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె నిరసన కార్యక్రమానికి అనేక ప్రజా సంఘాలు, మేధావులు, విద్యావంతుల మద్దతు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు గురుకుల పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు సింహాచలం, సుంద్రు చిన్నబ్బాయి, ముక్కల సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ మండల కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి -హుకుంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నూతన మండల కమిటీ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శిగా డి రోహిన్, మండల అధ్యక్షురాలుగా దీన కుమారి, 18 మండల కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు పీ.చిన్నారావు మాట్లాడుతూ, విద్యారంగంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి మాట్లాడుతూ, ఇటీవల బాలికలపై అత్యాచారాలు పెరిగాయన్నారు. బాలికల కళాశాలలో మహిళా ఉపాధ్యాయులను మాత్రమే నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆనందు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో ఎన్నికైన నూతన సభ్యులు

పెదబయలు: ఎస్ఎఫ్ఐ మండల మహాసభలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడు గా రాజ్, కార్యదర్శిగా అక్షయ్ కుమార్, జాయింట్ సెక్రెటరీగా సాయి చరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ముంచింగి పుట్టు: ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు త్రినాథ్, రామదాసులు హాజరయ్యారు. ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా పూరిస్తాన్, పవన్, వైస్ ప్రెసిడెంట్ గా అతిరామ్, జాయింట్ సెక్రటరీగా రాజులమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీనాయకులు రామదాసు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - చింతపల్లి : తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎర్రబొమ్మల పంచాయతీలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు మామిడి రాజబాబు ఆధ్వర్యంలో చేపడుతున్నారు. కుదుపు శింగి గ్రామంలో శుక్రవారం ఆ పార్టీ యువ నాయకుడు మామిడి చినరాజు సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు మాధవరావు, రమేష్, మురళి లోవరాజు పాల్గొన్నారు

ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు

కొయ్యూరులో విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి- కొయ్యూరు : గురుకుల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే విద్యాబోధన సాగని పాఠశాలలను వదిలి తాము ఇళ్లకు వెళ్లిపోతామని కొయ్యూరు గురుకుల కళాశాల, పాఠశాలలో విద్యార్థులు స్పష్టం చేశారు. దీనిపై రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను కోరుతూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పాంగి జీవన్ కృష్ణ , ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సూరిబాబు మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలో గిరిజన గురుకులాల్లో ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించాలని 28 రోజులుగా ఆందోళన చేస్తుండడంతో పాఠశాలల్లో తరగతులు జరగడం లేదన్నారు..గురుకులాల్లో 15ఏళ్ల సర్వీస్ ఉన్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను సిఆర్‌టిలుగా మార్చాలని, లేకుంటే విద్యార్థులతో రోడ్డెక్కి ఆందోళనలు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 28 రోజులు రోడ్డు మీద కూర్చొని ఉంటే ఐటీడీఏ అధికారులు పట్టించుకోకుండా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ధర్నాలో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఇఎసి సభ్యునిగా బాలయ్య

ప్రజాశక్తి - సీలేరు: ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం రాష్ట్రస్థాయి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి (ఆర్ఇఎసి) సభ్యునిగా జీకే వీధి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన రైతు వండలం బాలయ్య ఎంపికయ్యారని చింతపల్లి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త పి. బాలఉసేన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎంపిక ధ్రువీకరణ పత్రం అందజేశారు. గుంటూరులో వచ్చేనెల 8,9 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి 54వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశానికి హాజరుకావాలని రైతు వి.బాలయ్య ఆహ్వానం అందిందన్నారు.

విఎంఆర్‌డిఎ ప్రాజెక్టులతో విశాఖ అభివృద్ధి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖ అభివృద్ధిపై దృష్టి పెట్టారని, ఆయన నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో ప్రాజెక్టులు ఉండాలని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. గురువారం ఆయన ఛాంబర్‌లో ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా విశాఖ అభివృద్ధి కోసం పర్యాటక శాఖతో సమన్వయం చేసుకుని, పర్యాటకులను ఆకర్షించే ప్రాజెక్టులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భోగాపురం విమానాశ్రయాన్ని అనుసంధానం చేసేలా రహదారుల నిర్మాణంపై దృష్టి పెట్టాలని, ప్రస్తుతం జరుగుతున్న ప్రాజెక్టులను గుత్తేదారులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. అదే సమయంలో పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని సూచించారు. త్వరలో అన్ని ప్రాజెక్టులను క్షేత్ర స్థాయిలో పర్యటించి, పరిశీలన చేస్తానని చెప్పారు. ఈ సమీక్షలో చీఫ్ అర్బన్ ప్లానర్ వి.శిల్ప, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో ఏకైక పెద్ద పరిశ్రమైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తూ పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని సిఐటియు కంచరపాలెం జోన్ ప్రధాన కార్యదర్శి ఒ.అప్పారావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాల జెఏసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1355వ రోజుకు చేరాయి.

చంద్రరావు ఆశయాలను కొనసాగిద్దాం

ప్రజాశక్తి- చింతూరు : స్థానిక శ్యామల వెంకటరెడ్డి భవనంలో బండారు చంద్రరావు 39వ వర్ధంతి నిర్వహించారు. చంద్రరావు చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు పోడియం లక్ష్మణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రాచలం ఏజెన్సీలో గిరిజనులపై దోపిడి, అణిచివేతలను చూసి చలించిపోయి బండారు చంద్రరావు 18ఏళ్ల వయసులో ప్రజా పోరాటాలలో పాల్గొన్నారన్నారు.. ఈ ప్రజల కోసం పూర్తి కాలం పనిచేయాలని అనుకున్నారు. 1975 లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు టీవిఆర్ చంద్రం, చందర్రావు 16 నెలలపాటు అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారన్నారు. . భద్రాచలం డివిజన్ టింబర్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ స్థాపించి అధ్యక్ష కార్యదర్శులుగా బండారు చంద్రరావు, బత్తుల బీస్మారావు అనేక మిలిటెండ్ ఉద్యమాలను నడిపారని, . పార్టీలతో నిమిత్తం లేకుండా పేద ప్రజలు ఈ పోరాటంలో పాల్గొన్నారన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ కక్ష కట్టి అనేకసార్లు హత్య ప్రయత్నాలకు పాల్పడిందన్నారు.అప్పటికి మధ్యప్రదేశ్ ఒరిస్సా అటవీ ప్రాంతాల్లో కలిసి ఉన్న ఈ ప్రాంతంలో పట్టు సాధించాలని చూస్తున్న పీపుల్స్‌వార్ నక్సల్స్ తమతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చినా నిరాకరించడంతో 1985 నవంబర్ 5న జీడిగుప్ప అడవిలో అడ్డగించి కత్తులు గొడ్డలితో దాడిచేయగా, బత్తుల భీష్మారావ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, బండారు చందర్రావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డిసెంబర్ 13న మరణించారన్నారు. ఈఘటనలో ఎమ్మెల్యే కుంజ బుజ్జి కోలుకున్నారన్నారు. ఏజెన్సీవాసుల కోసం పోరాడి, ప్రాణాలను విడిచిన చంద్రరావు ఆశయసాధనకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో ఎర్రంపేట శాఖ కార్యదర్శి పాండు సుబ్బారావు. సభ్యులు. సురేష్. అప్పారావు. కోట పాల్గొన్నారు.

కూనవరంలో నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

కూనవరం : మండలం కేంద్రంలోనిమార్త శ్రీరామ్మూర్తి భవన వద్ద ఆవుల నాగమయ్య మీటింగ్ హాల్‌లో బండారు చంద్రరావు 39 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కమిటీ సభ్యుల మేకల నాగేశ్వరరావు పూలమాలలు వేసే నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, తాళ్లూరు శ్రీనివాసరావు కొండ ఈశ్వర్లు పాల్గొని నివాళులర్పించారు

గోవిందరెడ్డి వ్యాఖ్యలపై నిరసనలు

జికె.వీధిలో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి -సీలేరు: సచివాలయ ఉద్యోగులపై జివిఎంసి కౌన్సిల్‌లో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం ఉదయం జీకే వీధి మండల కార్యాలయం ఎదుట 80 మంది సచివాలయ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా లక్కవరపేట పంచాయితీ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సురకత్తి. రాము సంకాడ పంచాయతీ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ జి. రమేష్ మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, వారిని ప్రభుత్వ కార్యాలయాల్లో బదిలీ చేసి పనిచేయించాలని, ఖాళీగా ఉన్న వీరికి . ప్రభుత్వం కోట్లాది రూపాయలు జీతాలు చెల్లించాల్సి వస్తోందని అనడం ఎంతవరకు సమంజసమన్నారు. దీనిపై బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు.

విఆర్ పురం : జివిఎంసి కౌన్సిల్‌లో కార్పొరేటర్ గోవిందరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా, సచివాలయం ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం మండలపరిషత్ కార్యాలయం వద్ద గ్రామ సచివాలయం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో చేపట్టారు. వి.ఆర్ పురం మండల గ్రామ సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు సరియం రవికుమార్ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తూ సామాజిక పెన్షన్లు మొదలుకొని అనేక రకాలలైన ప్రజా సంక్షేమ సేవలు, సామాజిక సర్వేలు మరెన్నో ప్రభుత్వ కార్యక్రమాలు, పౌర సేవలను క్షేత్రస్థాయిలో అందిస్తున్న తమపట్ల గోవిందరెడ్డి వ్యాఖ్యలు దుర్మార్గమని, బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు.

మారేడుమిల్లి: సచివాలయ ఉద్యోగుల ఆత్మ గౌరవానికి భంగం కలిగేలా అనుచిత వాఖ్యలు చేసిన జివిఎంసి కార్పొరేటర్ గోవిందరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మారేడుమిల్లి గ్రామ సచివాలయంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల యూనియన్ మండల ప్రెసిడెంట్ దూబే లచ్చన్న దొర ఆధ్వర్యంల్లో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కూనవరం : కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ని సీనియర్ అసిస్టెంట్ ఎం నాగేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను కించపరుస్తూ మాట్లాడిన కార్పొరేటర్ గోవిందరెడ్డి, తన మాటలను వెనక్కి తీసుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగులందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ముత్యాలమ్మ

మంచినీటి ట్యాంకుల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -కొయ్యూరు : కొయ్యూరు మండలంలోని బూదరాళ్ల పంచాయితీ చౌడుపల్లి, లోయలపాలెం గ్రామాల్లో నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో నిర్మించి తలపెట్టిన రక్షిత మంచినీటి పథకం ట్యాంక్స్‌ను స్థానిక సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ ప్రారంభించారు.కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ కరుణ , ఎఇఇ సాయికృష్ణ సాయి కష్ణ , నవ నిర్మాణ సమితి ప్రాజెక్ట్ మేనేజర్ సన్యాసిరావు, ఏడ్వాకసి మేనేజర్ రవి కుమార్ , టెక్నికల్ డైరెక్టర్ వేణుగోపాల్ సిబ్బంది, వార్డ్ సభ్యులు సంజీవ్, ఎంపిటిసి వంతల నారాయణ, రెండు గ్రామాల ప్రజలు మహిళలు, యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి - రంపచోడవరం : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20 వరకు అల్లూరి జిల్లాలో ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంస్థ ఎస్ఇ జిఎస్.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు , స్వయం సహాయక సంఘాల మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించి, విజేతలకు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు. ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన, .'విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానము' అనే అంశంపై ఇంజనీరింగ్ కాలేజీల్లో వర్క్ షాపులు, విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై వినియోగదారులతో అన్ని విద్యుత్ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ప్రజాశక్తి - సీలేరు: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై గురు, శుక్రవారాల్లో పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివద్ధి శాఖ సూచనల మేరకు సర్పంచులు ఎంపీటీసీలు సచివాలయ సిబ్బంది మండల అధికారులు పంచాయతీ కార్యదర్శులు అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించామని ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు అన్నారు ఎంపీపీ బోయిన కుమారి శిక్షణ తరగతులు ప్రారంభించగా, మహిళా,శిశు సంక్షేమం విద్య, వైద్యం తదితర రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధనకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లాస్థాయిలో శిక్షణ పొందిన రంతాడ పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, వెలుగు ఏపీఎం సూర్యారావు, ంచాయతీరాజ్ ఏఈ జ్యోతి బాబు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, ఎంపిహెచ్ఒ సిడిపిఒలు వివరించారన్నారు. రెండో విడతలో మిగిలిన పంచాయతీల పరిధిలోనివారికి ఈనెల 17 18 తేదీల్లో శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇమ్మాన్యుయేల్, ఇఒపిఆర్‌డి పాపారావు, మండల వ్యవసాయశాఖ అధికారి మధుసూధనరావు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై దాడి అమానుషం

ప్రజాశక్తి - మారేడుమిల్లి: విధి నిర్వహణలో ఉన్న వైద్య సిబ్బందిపై దాడులు చేయటం అమానుషమని, దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని న్యాయవాది, సామాజిక వేత్త నోరి దత్తాత్రేయ అన్నారు. ఇటీవల మారేడుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో విధి నిర్వహణలో మహిళ ఎంపిహెచ్ఎ లక్కొండ ప్రభావతిపై మంగళవారం రాత్రి పత్రి ప్రవీణ్‌కుమార్ దాడి చేయటం దారుణమన్నారు. దీనిపై ఐటిడిఎ, ఇతర ఉన్నతాధికారులు దృష్టి పెట్టి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.